ముందుకు సాగని పనులు

- అసంపూర్తిగా పంచాయతీ భవనాలు
- నిర్మాణ పనులకు అనేక అడ్డంకులు



శిథిలావస్థలో రంగారెడ్డిపల్లి పంచాయతీ భవనం



కొలిమికుచ్చ తండాలో గుంతలకే పరిమితం అయిన పంచాయతీ భవన నిర్మాణం

గండేడ్: మండల పరిధిలో పంచాయతీల పక్కా భవనాల నిర్మాణం పడకేసింది. కొన్నిచోట్ల పనులు నత్తనడకన సాగుతుంటే మరికొన్ని చోట్ల శిలాఫలకాలకే పరిమితం అయ్యాయి. దీంతో గ్రామీణ పాలనకు అవస్థలు తప్పడం లేదు. కొత్తగా ఏర్పాటయిన గ్రామపంచాయతీలకు పక్కా భవనాలతో పాటు ఈపంచాయతీల నిర్మాణానికి గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాగా ఇప్పటికీ చాలాచోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గండేడ్ వేరుపడక ముందు 24 గ్రామపంచాయతీలు ఉండేవి. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలు వేరుపడ్డాక గిరిజన తండాలతో కలిపి 49 పంచాయతీలు ఏర్పాటయ్యాయి. వీటిలో కేవలం పాత 24 గ్రామ పంచాయతీలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. కాగా అందులోనూ కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. వీటన్నింటిని కలిపి మొత్తం 37 భవనాలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆయా పథకాల కింద రూ. 20 లక్షల చొప్పున మంజూరు చేశారు. అయినప్పటికీ అడుగులు ముందుకు పడడం లేదు.

ఆయా చోట్ల పరిస్థితి ఇలా..

- జానంపల్లి, ఆశిరెడ్డిపల్లి గ్రామాల్లో స్థలం లేకపోవడంతో ఉన్నదానిపైనే నిర్మించడానికి అనుమతి కోసం కమిషనర్‌కు పంపించారు. ఇంకా అనుమతి రాకపోవడంతో పనులు అసలే ప్రారంభం కాలేదు. రంగారెడ్డిపల్లి, బల్సూర్‌గొండ గ్రామాల్లో స్థలం లేదు. ఉన్న వాటిని డిస్‌మెంటల్ చేయాలి. కానీ ఎన్నికల కోడ్ రావడంతో డిస్‌మెంటల్ చేయడానికి వీలులేకుండా పోయింది. ఇప్పటి వరకు ఆర్డర్లు రాలేదు. దీంతో నేటికి పనులు ప్రారంభం కాలేదు.
- షేకపల్లిలో సైతం కొత్త భవన నిర్మాణానికి స్థలం లేకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.
- మహమ్మదాబాద్‌లో కొత్త భవనాన్ని రైతు వేదిక సమీపంలో నిర్మించాలని భావించారు. కాగా అది గ్రామానికి దూరంగా ఉందని అక్కడికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు అడ్డుకున్నారు. పాత భవనం డిస్‌మెంటల్ చేసి కడదామంటే.. భవనం బాగానే ఉంది కూల్చడం ఎందుకని అధికారులు చెప్పడంతో నిర్మాణానికి బ్రేక్ పడింది.
- ఆముదాల గడ్డ తండా భవనానికి పంచాయతీ నిర్మాణానికి టెండరు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. పైగా దీనికి స్థలం కూడాలేదు.
- చెన్నాయిపల్లి తండాలో నిర్మించాల్సిన భవనం అన్ని గ్రామాలకు మధ్యలో ఉంటుందని పూలపల్లి వద్ద పనులు చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మొదట్లో ఎవరు అపలేదు. కానీ తర్వాత తండావాసులు వచ్చి తమ తండాలోనే నిర్మించాలని పట్టుబట్టారు. దీంతో అది గుంతలకే పరిమితం అయ్యింది.
- కొలిమికుచ్చ తండాలో కూడ నిర్మాణం గుంతలతో ఆగిపోయింది. మొదట్లో ఒక్కదగ్గర నిర్మించాలని నిర్ణయించి గుంతలు తవ్వి బెడ్ కూడ వేశారు. కానీ గ్రామస్థులు వేరే చోట కట్టాలని పట్టుబట్టడంతో ఆగిపోయింది.

ఇదిలా ఉంటే ప్రారంభం అయిన వాటిలో కూడా పనులు నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం 9 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. 11 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. మిగతా 17 భవనాలు వివిధ కారణాలతో ఆగిపోయాయి. అదేవిధంగా ఈ పంచాయతీలు సైతం అందుబాటులోకిరాని పరిస్థితి నెలకొంది. ఇక కొన్ని కొత్త గ్రామ పంచాయతీలకు భవనాలు లేకపోవడంతో అంగన్‌వాడీ, పాఠశాల, ఇతర ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. పాతవాటిలో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. స్పెషల్ ఆఫీసర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రామల ప్రజలతో సమావేశాలు నిర్వహించడానికి వీలు కూడ లేకపోవడంతో తంటాలు పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం



పంచాయతీ భవనాల నిర్మాణానికి సంబంధించి ఎక్కడైతే స్థలం సమస్యగా ఉందో అక్కడ సంబంధిత మండల తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తాం. డిస్‌మెంటల్ చేయాల్సినవి ఇన్నాళ్లు ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయాయి. వెంటనే ఆర్డర్లు ఇచ్చేలా సంబంధిత అధికారులను కోరుతాం. అన్ని గ్రామాల్లోనూ పంచాయతీ భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నాం. వీలైనంత త్వరగా అన్ని నిర్మాణాలు పూర్తి చేస్తాం.

– కే.దేవన్న, ఎంపీడీఓ, ఉమ్మడి గండేడ్ మండలం

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి

గండేడ్: ఉమ్మడి మండల సర్వసభ్య సమావేశం గురువారం మొక్కుబడిగా సాగింది. ఆఖరి సమావేశం కావడంతో సమస్యలపై పెద్దగా చర్చ జరగలేదు. ఎంపీపీ మాధవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కల్యాణ లక్ష్మి పథకానికి అవసరమైన వివాహ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని..పలువురు సమస్య లేవనెత్తారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఇస్తారని తహసీల్దార్ నాగలక్ష్మి పేర్కొన్నారు. ఉపాధి హామీ ఏపీఓ హరిశ్చంద్రుడు గ్రామాల్లో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని సూచించారు. ఫిష్ పాండ్లు, ఫాం పాండ్‌లు ఇతరత్రా పనులు చేయించుకోవాలన్నారు. ఎంపీపీ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ దేవన్న, మిషన్ భగీరథ ఏఈ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ధర్నా



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మిడ్జిల్: మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయా తండాల గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని నాయకులు అన్నారు. ఈమేరకు భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, నాయకులు తిరుపతి, నరేందర్, శ్రీను, రమేష్, అరవింద్, మల్లేష్; చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆశకార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశలకు నష్టం కల్గించే పరీక్ష పెట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశలకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశలకు 2వ తేదిన పారితోషికం ఇవ్వాలన్నారు. ఆశలకు రూ. 50 లక్షల ఇన్సురెన్స్‌లు అమలు చేసే నిర్ణయాన్ని వెంటనే తీసుకోవాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను రూ. 5లక్షలు చెల్లించాలని ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు.

క్లుప్తంగా

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



జడ్చర్ల టౌన్: ప్రధానిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం పీఎం కిసాన్ సంక్షేమానికే మా ప్రాధాన్యం అని మొదటి సంతకం చేసిన మోదీ చిత్రపటానికి నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.బి. బాలకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మురళీ, బుక్క నవీన్, ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, నడిమింటి శ్రీనివాసులు, సామల నాగరాజు, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డికి ఘననివాళి

దేవరకద్ర: మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఎన్టీఆర్ చౌరస్తాలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆదిహన్మంతరెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు గుడిబండ హన్మంతరెడ్డి, నాయకులు రవి, ఉసేనప్ప, రాజేశ్వర్‌రెడ్డి, చందుగౌడ్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదెమృతి

గండేడ్: విద్యుత్‌షాక్‌తో ఓ గేదె మృతి చెందిన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. జిన్నారం తండాకు చెందిన కిషన్‌నాయక్ ఎప్పటిలాగే బుధవారం సాయంత్రం తన పశువులను పొలం వద్ద పాకలో కట్టేసి ఇంటికి వచ్చాడు. అయితే రాత్రికి ఓ గేదె తాడు తెంచుకొని మేత మేసుకుంటూ బయటకు వచ్చింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం పొలానికి వెళ్లిన కిషన్ నాయక్ గేదె చనిపోయి ఉండడాన్ని గమనించాడు. తనను ఆదుకోవాలని కోరాడు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబుపేట: కారుకొండ, తీగలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీ ధౌర్యానాయక్ తెలిపారు. పోలేపల్లి ఫీడర్ మరమ్మతు నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని గురువారం కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా తైక్వాండో అసోసియేషన్‌కు అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైనట్లు జి.సాయిలు, కె.సురేందర్‌బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరి అధ్యక్షతన డీవైఎస్ఓ. బీఎస్.ఆనంద్, టీఎస్‌టీఏ పరిశీలకుడు సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.ప్రవీణ్‌కుమార్, వి.వెంకటేష్, జాయింట్ సెక్రెటరీలుగా ఈ.రాజు, కె.రాజేష్, కోశాధికారిగా ఎస్.శంకర్, ఈసీ మెంబర్లుగా మహ్మద్ రఫియోద్దీన్, బోయ సాయి కీర్తన, భీమయ్యలు ఎన్నికైనట్లు తెలిపారు.

బోరు మోటారు దొంగతనంపై ఫిర్యాదు

మహమ్మదాబాద్: బోరు మోటారు దొంగతనంపై పోలీసులు గురువారం కేసునమోదు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా.. గండేడ్ పరిధిలోని చిన్నవార్వాల్‌కి చెందిన భీమయ్యకు సంబంధించిన బోరుమోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల ఎత్తుకెళ్లారు. చుట్టపక్కలా వెతికినా దొరకలేదు. దీంతో ఆయన గురువారం మహమ్మదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. ఆయన కథనం మేరకు..వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం మల్కి మియాపూర్‌కి చెందిన నాగరాజు(40) వ్యక్తి జడ్చర్లలో నివాసం ఉంటూ మేస్త్రీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పశువుల అపహరణ

జడ్చర్ల: గొల్లపల్లి శివారులోని పంటపొలంలో కట్టేసిన రెండు ఎద్దులను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి అపహరించి తీసుకెళ్లారని యజమాని భాగం ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పశువుల విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందని వాపోయాడు. గురువారం అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న పీఠాధిపతులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం మళయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించిన నిత్యశుద్దానంద స్వామి ఆరాధనోత్సవాలు గురువారం ముగిశాయి. వేడుకల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన 40మంది పీఠాధిపతులు పాల్గొని తమ సందేశాలను ఇచ్చారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా ఉదయం 7గంటలకు రుద్రాభిషేకం, 9గంటలకు విష్ణు సహస్రనామయజ్ఞం, కుంకుమార్చన, ఆశీర్వాద పూర్వక ప్రవచనాలు, మధ్యాహ్నం నిత్యశుద్దానంద సమాధిపూజలు చేశారు. 1గంటలకు మహానివేదన, మంగళహారతి, శాంతిమంత్రాలు, తీర్థప్రసాద వితరణ అన్నదానంతో ఉత్సవాలు ముగించారు. వెంకటచరణ్, ఆచార్య గౌరయ్యస్వామి, తిరుపతి తీర్థానందస్వామి, ఉమ్మెంతల మహేశ్వర్, రామకృష్ణ, ఆనందస్వామిల తోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్, లా కళాశాలల ఏర్పాటుపై వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరుతూ పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పీయూలో కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి జిల్లా విద్యార్థులకు న్యాయం జరుగుతుందని, ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని, అందుకు సంబంధించిన ప్రక్రియను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తిక్, జేఏసీ చైర్మన్ రాము, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, రూప్‌సింగ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



భూ కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి



ధర్నాలో పాల్గొన్న బాధితులు

నవాబుపేట: మండల కేంద్రంలో పేదల భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ధర్నా నిర్వహించారు. ఇటీవల జరిగిన దాడి ఘటనపై తమను ఆదుకుని భూములకు రక్షణ కల్పించాలని కోరారు. కాగా నిరసనకు కాంగ్రెస్ నాయకులు మద్దతు పలికారు. వారికి అండగా ఉంటామని తెలిపారు. సాయంత్రం వరకు చేపట్టిన దీక్షను నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. నాయకులు వెంకటయ్య, అంజయ్య, సత్యం, ఆనంద్, నర్సింహ, రాజేష్, శ్రీనివాస్, శివరాములు, తిరుపతయ్య, శివకుమార్, పెంటయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలతో బీఆర్ఎస్‌కు సంబంధం లేదు

నవాబుపేట: మండల కేంద్రంలో ఇటీవల రైతుల పొలాల్లో జరిగిన ఘటనపై కాంగ్రెస్ రాజకీయం చేస్తూ బీఆర్ఎస్‌ను బద్నాం చేస్తోందని.. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ధర్నా నేపథ్యంలో కాంగ్రెస్ ఆరోపణలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు బురదజల్లేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కబ్జాలతో తమ పార్టీకి సంబంధం లేదన్నారు. వ్యక్తిగతంగా జరిగిన గొడవను పార్టీకి అపాదించటం సరికాదని.. ఇలాంటి చౌకబారు చర్యలు మానుకోవాలని హితువు పలికారు.

ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

చిన్నచింతకుంట: ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం టి. రేవతి అన్నారు. బాల్‌నగర్‌లో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించిన ఆమె పదోన్నతుల్లో భాగంగా అప్పంపల్లికి జీహెచ్ఎంగా వచ్చారు. గురువారం బాధ్యతలు చేపట్టారు. తోటి ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నీట్ అధికారులపై చర్యలకు డిమాండ్



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్‌లో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ చేపట్టాలని, బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈమేరకు నాయకులు నరేష్ తేజా మాట్లాడుతూ నీట్‌లో గందరగోళం వల్ల 23 లక్షల మంది విద్యార్థుల జీవితం ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఫలితాలను 10 రోజుల ముందే విడుదల చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈమేరకు నిరసన తెలుపుతున్న వారిని ఆపాలని పోలీసులు కోరగా... అలాగే కొనసాగిడచంతో వాగ్వాదం చెలరేగింది. దీంతో పోలీసులను ఏబీవీపీ నాయకులను అరెస్టు చేశారు. జిల్లా నాయకులు సతీష్, శివ, అరవింద్, వరుణ్, నవీన్, కార్తిక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసనలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్‌పై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, వెంటనే పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ పరీక్షపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సురేష్, రాజశేఖర్, రమేష్, మధు, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో మెరుగైన విద్య



గుడిబండలో..

అడ్డాకుల: ప్రభుత్వ బడిలో మెరుగైన విద్య అందుతుందని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొన్నకల్, గుడిబండ గ్రామాల్లో కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ నాగయ్య, ఏపీఎం సుధీర్‌కుమార్, ఎంపీటీసీ శకుంతల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లింగంపల్లిలో పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

నవాబుపేట: జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి గురువారం లింగంపల్లి జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, సీఆర్‌పీ జనార్దన్, శేఖర్‌రెడ్డి, పద్మారెడ్డి తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: కొకుంట్ల మండలం రేకులంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ స్వామి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుంతలమయంగా కందూర్ బీటీరోడ్డు



అడ్డాకుల: మండలంలోని జాతీయ రహదారి నుంచి కందూర్ వరకు ఉన్న బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. హైవే నుంచి కందూర్ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న బీటీరోడ్డుపై చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. చిన్న వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలువడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాయిబాబా దేవాలయం, క్రషర్, గుట్ట సమీపంలో రోడ్డుపై ఎక్కువగా గుంతలు కనిపిస్తున్నాయి. ఇటీవల గుంతల్లో మట్టిని వేసినా వర్షాలకు వాటిలో నీళ్లు నిలిచి బురదమయంగా మారుతోంది. ఈ రోడ్డుపై కందూర్‌తో పాటు సుంకరాంపల్లి, చౌడాయపల్లి, వడ్డెపల్లి, ఉప్పరిపల్లి, మానాజీపేట తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి బీటీరోడ్డును బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని రోజులుగా పట్టణంలోని వివిధ దుకాణాలను మున్సిపల్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు, పుట్నాలబట్టీ, మదీనా మజీద్, బాలాజీనగర్, భగీరథ కాలనీలలోని టిఫిన్ సెంటర్లు, కిరాణ తదితర దుకాణాలపై దాడులు చేసి మొత్తం 19 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనపరుచుకున్నారు. ఈ సందర్భంగా రూ.ఏడు వేల జరిమానా వసూలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఏర్పుల నాగరాజు నియమితులయ్యారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్ గురువారం జిల్లా కేంద్రంలో ఈ మేరకు ఆయనకు నియామకపత్రం అందజేశారు. అదే విధంగా మహబూబ్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జీగా పి.రాజును నియమించారు. కార్యక్రమంలో సంద వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.